# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 283 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం, జనవరి 22, 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




## తెలంగాణలో ప్రపంచ ఆర్థిక ఫాలోఆప్ సదస్సు

**దావోస్ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదన**

- ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు
- మద్దతు తెలిపిన ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు

**హైదరాబాద్, జనవరి 21 (ప్రభాత ఉదయం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక ప్రతిపాదన చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ఫాలోఅప్ సదస్సును ప్రతి సంవత్సరం తెలంగాణలో నిర్వహించాలని ఆయన సూచించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్ నగరంలో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బ్లైజ్ కో ఫౌండర్ సీఈవో దినకర్ మునగాల సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో బ్లైజ్ ఆర్ అండ్ డీ సెంటర్ విస్తరణకు తెలంగాణ ప్రభుత్వంతో ఆయన ఎంవోయూ కుదుర్చుకున్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# "గూడెం" గుండెలు అదురుతున్నాయా!

## మహిపాల్ రెడ్డి రాజకీయ కప్పదాట్లు భవిష్యత్తుకు శరాఘాతమా?

## మాటలకూ, చేతులకూ పొంతన లేక నియోజకవర్గ ప్రజల్లో అయోమయ స్థితి





**హైదరాబాద్, జనవరి 21 (ప్రభాత ఉదయం):** ఏ పార్టీలోనూ ఉండలేక, ఓవైపు వ్యతిరేక వర్గం, మరోవైపు స్వపక్షంలోనే విపక్ష నేతల ఒత్తిడి వలలో పడి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విలవిల్లాడుతున్నారని ఎన్నో రకాల ప్రచారాలు ఇటీవల జోరందుకున్నాయి. తాజాగా ఆయన చేసిన రాజకీయ వ్యాఖ్యలు, ఆయన రాజకీయ ప్రయాణం ఇటీవలి కాలంలో ఎన్నో మలుపులు తిరుగుతోంది. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) టికెట్‌పై మూడు సార్లు విజయం సాధించిన ఆయన, 2024లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే, ఇప్పుడు ఆ నిర్ణయాన్ని తప్పుగా అంగీకరిస్తూ, మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. ఈ పార్టీ కప్పదాట్లు ఆయన రాజకీయ భవిష్యత్తును ఎలా ప్రభావితం చేస్తున్నాయనే చర్చ నడుస్తోంది.ఇది కేవలం వ్యక్తిగత లాభాల కోసమేనా లేక రాజకీయ లెక్కల్లో భాగమా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఆయన

### అభివృద్ధి అంటే భవనాల నిర్మాణమే కాదు..

# ప్రజల జీవితాల్లో మార్పు: భట్టి విక్రమార్క



**'రాష్ట్ర సంపదను ప్రజలకు సమానంగా పంచటమే ప్రభుత్వ లక్ష్యం'**

**ధర్మపురి, జనవరి 21 (విశాల తెలంగాణ):** తెలంగాణలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో బుధవారం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, రూ.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, రూ.17 కోట్లతో వాటర్ ప్లాంటు నిర్మాణం, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ బాలుర వసతి గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ..మిగతా 2లో



### చరిత్రలో తొలిసారి...

# రికార్డు స్థాయిలో రూపాయి పతనం

**డాలర్‌తో పోలిస్తే రికార్డు కనిష్ఠానికి పడిపోయిన రూపాయి**
**ఒక దశలో 91.74 స్థాయికి చేరిన మారకం విలువ**
**బంగారం, వెండి దిగుమతులు పెరగడం ఒక కారణం**
**దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడుల తరలింపు ప్రభావం**
**అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు కూడా పతనానికి మరో కారణం**

2

## మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు

**పోటీపై కవిత క్లారిటీ**

**జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని స్పష్టం**




**హైదరాబాద్, జనవరి 21 (ప్రభాత ఉదయం):** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని.. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కవిత మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎవరు మద్దతు కోరినా ఇస్తామని కవిత తెలిపారు. అవసరమైన చోట తనతో పాటు జాగృతి నేతలు ప్రచారం చేస్తారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తుదిదశకు చేరుతుందనే నమ్మకం తనకు లేదన్నారు. తనలాంటి బాధితులకు ...మిగతా 2లో

### సింగరేణి అక్రమాలపై

# సీబీఐ దర్యాప్తు జరగాలి

**కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, జనవరి 21 (ప్రభాత ఉదయం):** భారతదేశ ఇంధన అవసరాలను తీర్చడంలోనూ, బొగ్గు ఉత్పత్తిలోనూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కొనియాడారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి కార్మికుల ...మిగతా 2లో

## ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ప్రపంచ దేశాల సహకారం అవసరం: జైశంకర్



ఉగ్రవాదం గురించి కీలక వ్యాఖ్యలు చేసిన భారత విదేశాంగ మంత్రి జైశంకర్
ప్రపంచ దేశాలు టెర్రరిజాన్ని సహించకూడదని వ్యాఖ్యలు

2

## ఎన్డీఏలో చేరిన ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్

**తమిళనాడు బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ పీయూష్ గోయల్‌ను కలిసి తన నిర్ణయాన్ని ప్రకటించిన దినకరన్**



**చెన్నై, జనవరి 21 (ప్రభాత ఉదయం):** అసెంబ్లీ ఎన్నికల వేళ తమిళనాడు రాజకీయాల్లో పొత్తుల పర్వం మొదలైంది. ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ ఎన్డీఏ కూటమిలో చేరారు. ఈ మేరకు చెన్నైలో తమిళనాడు బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ పీయూష్ గోయల్‌ను కలిసి తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా టీటీవీ దినకరన్ మాట్లాడారు. రాజీ పడిన వారు ఎప్పుడు ఓడిపోరని అన్నారు. ఇదొక ...మిగతా 2లో

# "గూడెం" గుండెలు అదురుతున్నాయా!

మొదటి పేజీ తరువాయి

రాజకీయ నేపథ్యం గురించి చెప్పాలంటే విజయాల నుంచి మార్పుల వరకు గూడెం మహిపాల్ రెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గంలో బలమైన పునాది కలిగిన నాయకుడు అని ఘంటాపథంగా చెప్పవచ్చు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్‌ను రెండు సార్లు ఓడించారు. అయితే తర్వాత ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో చేరిన ఆయన, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు మారిన 10వ ఎమ్మెల్యేగా మారారు.ఈ మార్పు నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు కీలకంగా మారాయి. మైనింగ్ కేసులో ఆయన సంస్థ, తన సోదరుడిపై జరిగిన దాడులు ఈ పార్టీ మార్పుకు కారణమని ఆరోపణలు ఉన్నాయి.పార్టీ మారినప్పటికీ అక్టోబర్ 2025 నాటికి ఆయన రాజకీయంగా ఒంటరిగా మారారు. బీఆర్ఎస్ దాఖలు వేసిన అనర్హత పిటిషన్ పై స్పీకర్ ముందు హాజరైనప్పుడు, తాను ఇంకా బీఆర్ఎస్‌తోనే ఉన్నానని చెప్పినా, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటాన్ని వివరించలేదు.ఇప్పుడు, 2026 జనవరిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ముందు, ఆయన కాంగ్రెస్‌లో చేరడాన్ని 'తప్పటడుగు'గా ఆయనే స్వయంగా అభివర్ణించారు. "కాంగ్రెస్‌లో చేరి వెంట్రుక మందం లబ్ధి లేదు, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి" అంటూ బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



ఇది ఆయన మళ్లీ బీఆర్ఎస్‌కు తిరిగి వచ్చే సంకేతమా?విమర్శనాత్మక దృక్పథ అవకాశవాదమా?రాజకీయ దుర్బుద్ధా? అనే చర్చ నియోజకవర్గ స్థాయిలో జోరుగా సాగుతోంది.మహిపాల్ రెడ్డి పార్టీ మార్పులు భారతీయ రాజకీయాల్లో సర్వసాధారణమైన 'కప్పదాటు' సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి తర్వాత, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు మళ్లడం సాధారణమైంది. అయితే, ఆయన విషయంలో ఇది వ్యక్తిగత లాభాల కోసమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈడీ దాడుల తర్వాత కాంగ్రెస్‌లో చేరడం, ఇప్పుడు లబ్ధి లేదని ఫిర్యాదు చేయడం, ఇది రాజకీయ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. ఓటర్లు ఇలాంటి నాయకులను ఎలా చూస్తారు? పటాన్‌చెరు వంటి పారిశ్రామిక ప్రాంతంలో, అభివృద్ధి అంశాలు ముఖ్యం కదా, పార్టీ మార్పులు కాదు కదా అనేది నిర్వివాదాంశం.ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై కూడా ఊహాగానాలు వ్యక్తం కావడం గమనించాల్సిన అంశం. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించడం ద్వారా, ఆయన కాంగ్రెస్‌ను వీడుతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. మరోవైపు, బీఆర్ఎస్‌కు తిరిగి వచ్చినా పార్టీ అధిష్టానం,పార్టీలోని విధేయులు ఆయనను స్వీకరిస్తారా అనేది సందేహం. ఇప్పటికే ఆయనను తిరిగి బిఆర్ఎస్ పార్టీ లోకి ఆహ్వానించే అంశంపై పార్టీ అధిష్టానం సుముఖత వ్యక్తం చెయ్యడం లేదని,పలువురు నేతలు కూడా అడ్డుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది.. దీంతో ఏం చేయాలో పాలుపోక అవస్థలు పడుతున్నారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో ఇలాంటి మార్పులు సాధారణమే అయినా, అవి నాయకుల విశ్వసనీయతను క్షీణింపజేస్తాయి. మహిపాల్ రెడ్డి విషయంలో, ఈ 'తప్పటడుగు' అంగీకారం ఓటర్లకు ఎలాంటి సందేశం పంపుతుంది అంటే రాజకీయం వ్యక్తిగత లాభాలకు మాత్రమేనా? అనే విమర్శలకూ తావిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఇది ఆయనకు పరీక్షగా మారవచ్చు. రాజకీయ నాయకులు ఇలాంటి మార్పులతో ఓటర్ల విశ్వాసాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించాలి. ఇది ప్రజాస్వామ్యానికి ముఖ్యం అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని వ్యవహరించాలని ఆయన సన్నిహితులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రజలు మాత్రం జరుగుతున్న పరిణామాలపై సందిగ్ధావస్థ లో ఉన్నారు.

## సింగరేణి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాలి

మొదటి పేజీ తరువాయి

పోరాటం చిరస్మరణీయమని గుర్తుచేశారు. 'సకల జనుల సమ్మె' నుంచి ప్రతి చిన్న ఆందోళన వరకు సింగరేణి భాగస్వామ్యం రాష్ట్ర ఏర్పాటుకు ఎంతో బలాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. దేశం మొత్తం మీద అత్యధిక బొగ్గును ఉత్పత్తి చేసే ప్రధాన సంస్థలలో ఒకటిగా సింగరేణి వెలుగొందుతోందని ఆయన ప్రశంసించారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఆరంభంలో అద్భుతమైన లాభాలతో సాగిన సింగరేణి, ప్రస్తుతం అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంస్థ నిర్వహణలో వస్తున్న మార్పులు, కొన్ని నిర్ణయాల కారణంగా సంస్థ పరిస్థితి దిగజారుతోందని ఆయన విమర్శించారు. ఒకప్పుడు లాభాల బాటలో ఉన్న సంస్థ, ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకోవడం దురదృష్టకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

టెండర్ల రద్దు సింగరేణికి అన్యాయం చేయడమే..

ప్రస్తుతం నైనీ కోల్ బ్లాక్‌పై విస్తృతంగా చర్చ జరుగుతోందని కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ (Telangana)కు గుండెలాంటిది సింగరేణి అని అన్నారు. కానీ, సింగరేణిని బంగారు బాతులా కాంగ్రెస్ వాడుకుంటున్నారని కామెంట్ చేశారు. అవినీతి, అక్రమాలకు కేంద్రంగా సింగరేణి మారిందన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థలకు బొగ్గును అందించాలని కేంద్రం నైనీ కోల్ బ్లాక్-2 (Naini Coal Block-2)ను తెలంగాణకు కేటాయించిందని అన్నారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్‌ను సింగరేణిని వాడుకుంటున్నాయని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో కేంద్రం సహకారం అందిస్తోందని, ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై చర్చించానన్నారు. నైనీ బొగ్గు గనులకు చివరి అనుమతులు వచ్చాక టెండర్లు పూర్తి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నాన్చుతోందని అన్నారు. టెండర్లను రద్దు చేయడం సింగరేణికి ప్రత్యక్షంగా అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. సైట్ విజిట్‌కు సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టారని గుర్తుచేశారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనేది సెల్ఫ్ సర్టిఫికేషన్ నిబంధన మాత్రమేనని అన్నారు. కానీ, సింగరేణి ఇవ్వాలనే నిబంధన పెట్టడం ఏంటని ప్రశ్నించారు. దీని అర్థం.. వారికి నచ్చిన వారికి నైనీ బ్లాక్ ఇవ్వాలని చూస్తున్నారని కామెంట్ చేశారు.

**మంత్రుల మధ్య వాటాల వివాదంతోనే..**

గతంలో సింగరేణి మైనింగ్ చేస్తామని ముందుకొస్తే బీఆర్ఎస్ బెదిరించి ప్రైవేటు సంస్థలకు బ్లాక్‌లు వెళ్లేలా వ్యవహరించిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పంథాను కొనసాగిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. తాడిచర్ల కోల్ బ్లాక్‌ను కేంద్రం జెన్‌కోకు కేటాయించిందని తెలిపారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.47 వేల కోట్ల బకాయి ఉందని, గ్రేడ్-11 కోల్‌ను టన్నుకు రూ.4,800కి అమ్ముతోందని అన్నారు. కోల్ ఇండియా గ్రేడ్-11 కోల్‌ను రూ.1,605కి అమ్ముతోందని తెలిపారు. సింగరేణి బొగ్గు క్వాలిటీ కూడా తగ్గుతోందని, ఏపీ సహా పలు రాష్ట్రాలు కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నాయని అన్నారు. ఏది ఏమైనా సింగరేణి అక్రమాలపై దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుందని, సింగరేణిని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రుల మధ్య వాటాల వివాదంతోనే సింగరేణి అంశం వెలుగులోకి వచ్చిందని, నైనీ బ్లాకే కాదు.. పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగాలన్నారు. సింగరేణి నిర్వహణ బాధ్యత కేంద్ర తీసుకుంటుందని.. విచారణపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాస్తానని కిషన్ రెడ్డి అన్నారు.

**వాటాల వివరాలపై స్పష్టత..**

సింగరేణి సంస్థపై పూర్తి హక్కులు కేంద్రానివే అన్నట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా సంస్థలోని వాటాల వివరాలను ఆయన స్పష్టం చేశారు. సింగరేణిలో తెలంగాణకు 51 శాతం వాటా ఉండగా, కేంద్రానిది 49 శాతం వాటా ఉందన్నారు. మెజారిటీ వాటా రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉన్నందున, సంస్థను కాపాడుకోవడంలో రాష్ట్రం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ సింగరేణి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.



## ఎన్డీఏలో చేరిన ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్

మొదటి పేజీ తరువాయి

కొత్త ప్రారంభమని తెలిపిన ఆయన దివంగత మాజీ సీఎం జయలలిత మద్దతుదారులుగా తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. వ్యక్తిగత వైరుధ్యాలు పక్కనపెట్టి తమిళనాడు అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎన్‌డీఏలో చేరానని తెలిపారు.

"రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మేము అన్నాడీఎంకే- బీజేపీ కూటమితో కలిసి బరిలోకి దిగబోతున్నాం. ప్రజలు కోరుకున్నట్లుగా రాష్ట్రానికి మంచి రోజులు తీసుకుచ్చే దిశగా పనిచేయబోతున్నాం. ప్రజల సంక్షేమానికి ఏఎంఎంకే మద్దతు ఇస్తుంది" అని దినకరన్ పేర్కొన్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో, టీటీవీ దినకరన్ ఏఎంఎంకే పార్టీ ఓట్లు చీలిపోవడంతో దక్షిణ తమిళనాడులోని డీఎంకేకు కలిసొచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమైంది. అయితే, తాజాగా టీటీవీ దినకరన్ రాక ఏఐఏడీఎంకేకు అదనపు బలాన్ని చేకూరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, ఈ కూటమిని మరింత బలోపేతం చేయడానికి కలిసొచ్చే పార్టీలను కూటమిలోకి చేర్చుకోవడానికి బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది.

దినకరన్ మళ్లీ ఎన్‌డీఏ కూటమిలో చేరడం సంతోషకరమని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. డీఎంకే అసమర్థ పాలన, ఆ పార్టీ నాయకులు చేసిన అవినీతిని తమిళనాడు ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో దినకరన్ పార్టీ ఎన్‌డీఏ కూటమిలో భాగంగా పోటీ చేసింది. అయితే గతేడాది కూటమి నాయకత్వ బాధ్యతలను పళనిస్వామికి అప్పగించగా ఆయన వ్యతిరేకించారు. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీతో పొత్తు పెట్టుకోవాలని ప్రయత్నించినా అది సఫలం కాలేదు. చివరకు మళ్లీ ఎన్‌డీఏ కూటమిలో చేరారు.

మరోవైపు, టీటీవీ దినకరన్ ఎన్‌డీఏలో చేరడాన్ని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి స్వాగతించారు. ఈ చర్య 'స్వర్ణయుగం' పాలనను పునఃస్థాపించే ఒక అడుగుగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు అయన ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. "డీఎంకే పాలనను కూకటివేళ్లతో పెకిలించి, రాష్ట్రంలో వారసత్వ రాజకీయాలకు ముగింపు పలకడమే ఎన్‌డీఏ లక్ష్యం." అని పళనస్వామి పేర్కొన్నారు.

మరోవైపు, త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో రాజకీయాలు వేడెక్కాయి. అధికార, విపక్షాలు పోటాపోటీగా తలపడుతుంటే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని టీవీకే ప్రయత్నిస్తోంది. చిన్న పార్టీలన్నీ ఏదో ఒక కూటమిలో చేరిపోయి ఉనికి కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. ఐదేళ్లలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమమే మళ్లీ తమ పార్టీని అధికారంలోకి తెస్తాయని డీఎంకే పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. బీజేపీతో కలిసి అధికార పీఠం అందుకుంటామని అన్నాడీఎంకే నమ్ముతోంది. దశాబ్దాలుగా రెండు పార్టీల పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పుకు ఓటేస్తారని విజయ్ ఆశతో ఉన్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ మాజీ గవర్నర్, బీజేపీ తమిళనాడు మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ నేతృత్వంలో ఎన్నికల మేనిఫెస్టో కమిటీని బీజేపీ ఇదివరకే ఏర్పాటు చేసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులో రాజకీయ పార్టీలు పొత్తుల చర్చలు, ఎన్నికల వ్యూహాలు, మేనిఫెస్టోల తయారీ తదితర పనుల్లో నిమగ్నమయ్యాయి. అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకున్న బీజేపీ, తమిళిసై నేతృత్వంలో ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దురైసామి తదితర 12 మంది సభ్యులు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు

మొదటి పేజీ తరువాయి

న్యాయం జరిగే అవకాశం లేదని చెప్పారు. కావాలనే హరీశ్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చి డైవర్షన్ చేస్తున్నారన్నారు. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ ఉద్యమకారుల విగ్రహాలు ఉండాలన్నారు. ముచ్చర్ల సత్యనారాయణ విగ్రహం అక్కడ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

## చరిత్రలో తొలిసారి... రికార్డు స్థాయిలో రూపాయి పతనం

**న్యూఢిల్లీ, జనవరి 21 (ప్రభాత ఉదయం):**
అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఇవాళ ట్రేడింగ్‌లో రూపాయి భారీగా నష్టపోయి, ఒక దశలో 91.74 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. మార్కెట్‌లో నెలకొన్న పలు ప్రతికూల పరిణామాల మధ్య ఒక్కరోజే 77 పైసల మేర విలువను కోల్పోయింది. నిన్న 90.97 వద్ద ముగిసిన రూపాయి, ఇవాళ ఉదయం 91.05 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ట్రేడింగ్ సాగుతున్న కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో రూపాయి విలువ అంతకంతకూ దిగజారింది. బంగారం, వెండి దిగుమతులు పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FIIలు) దేశీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకోవడం పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. మరోవైపు అమెరికా, యూరప్ మధ్య వాణిజ్య యుద్ధ భయాలు, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందన్న వార్తలు వంటి అంతర్జాతీయ అంశాలు కూడా రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. వీటికి తోడు దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల్లో కొనసాగడం రూపాయి విలువను మరింత బలహీనపరిచిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ప్రపంచ దేశాల సహకారం అవసరం: జైశంకర్

**న్యూఢిల్లీ, జనవరి 21 (ప్రభాత ఉదయం):**
భారత్, స్పెయిన్ రెండూ ఉగ్రవాద బాధిత దేశాలనేనని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. టెర్రరిజాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రపంచం సహించకూడదని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రపంచ దేశాల సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. దిల్లీలో స్పెయిన్ విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ అల్బారెస్‌తో జైశంకర్ భేటీ అయ్యారు. ఈ క్రమంలో ఇరుదేశాలు ఎదుర్కొంటున్న ఉమ్మడి సవాళ్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.

"ప్రపంచంలో పరిణామాలు క్రమంగా మారుతున్నాయి. ఉమ్మడి సవాళ్లపై దేశాలు పరస్పరం సహకరించడం గతంలో కంటే ఇప్పుడు చాలా అవసరం. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ఈ సహకారం మరింత అవసరం. భారత్, స్పెయిన్ రెండూ ఉగ్రవాద బాధిత దేశాలు. ఉగ్రవాదాన్ని ప్రపంచ దేశాలు సహించకూడదు. టెర్రరిజం పట్ల జీరో టాలరెన్స్ ప్రదర్శించాలి." అని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ అభిప్రాయపడ్డారు.

అలాగే స్పెయిన్‌లోని కార్డోబాలో జనవరి 18న జరిగిన రైలు ప్రమాదంపైనా జైశంకర్ స్పందించారు. ఆ రైలు యాక్సిడెంట్‌లో మరణించిన 40 మంది మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలువాలని ఆకాక్షించారు. కాగా, పట్టాలు తప్పిన హైస్పీడ్ రైలును మరో హైస్పీడ్ రైలు ఢీకొనడంతో స్పెయిల్‌లో దుర్ఘటన జరిగింది. ఈ యాక్సిడెంట్‌లో 40 మంది చనిపోగా, మరో 150 మందికిపైగా గాయపడ్డారు.

"భారత్, స్పెయిన్ స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉన్నాయి. ఇరుదేశాలు మధ్య దౌత్య సంబంధాలు ఈ ఏడాది 70వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. వచ్చే నెలలో భారత్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌ను నిర్వహిస్తోంది. ఏఐ పట్ల మా విధానం అందరినీ కలుపుకొని



వెళ్లడమే. వడోదరలోని ఎయిర్‌బస్-టాటా C-295 ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను 2024 అక్టోబరులో సంయుక్తంగా ప్రారంభించాం. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ఫ్యాక్టరీ నుంచి మొదటి మేడ్ ఇన్ ఇండియా C-295 విమానం బయటకు వస్తుందని మేము ఆశిస్తున్నాం.

అలాగే ఇరుదేశాల మధ్య ఉన్న సాంస్కృతిక సంబంధాలను జైశంకర్ హైలెట్ చేశారు. యోగా, ఆయుర్వేదం, భారతీయ సంస్కృతి స్పెయిన్‌లో ప్రాచుర్యం పొందాయని అన్నారు. స్పానిష్ భాష, సంస్కృతిపై భారత్‌లో ఆసక్తి పెరుగుతోందని పేర్కొన్నారు. "యూరోపిన్ యూనియన్‌లో భాగమైన స్పెయిన్ భారతదేశ అగ్ర వాణిజ్య భాగస్వాములలో ఒకటి. ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 8 బిలియన్ డాలర్లు దాటింది. ఆర్థిక భాగస్వామ్యం ఇరు దేశాల బంధాలకు ఒక కీలకమైన స్తంభంలాంటిది. స్పానిష్ కంపెనీలు భారత్‌లో ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీలలో పెట్టుబడులు పెడుతున్నాయి. భారతీయ కంపెనీలు స్పెయిన్‌లో ఐటీ, ఫార్మాస్యూటికల్స్, ఆటోమోటివ్ భాగాలలో ఇన్వెస్ట్ చేస్తున్నాయి. ఈ వ్యాపార సహకారాన్ని మరింతగా పెంచుకోవడానికి భారత్ కృషి చేస్తోంది. " అని జైశంకర్ వెల్లడించారు.

స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ పెరెజ్ త్వరలో భారత పర్యటనకు రానున్నారని ఆ దేశ విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ అల్బరేస్ తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా త్వరలో స్పెయిన్ పర్యటనకు వస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. దిల్లీలో జైశంకర్‌తో భేటీలో అల్బరేస్ ఈ వ్యాఖ్యలు చేశారు. "కార్డోబాలో ఇటీవల జరిగిన రైలు ప్రమాద బాధితులకు సంతాపం తెలిపినందుకు జైశంకర్‌కు ధన్యవాదాలు. ఈ అత్యంత బాధాకరమైన తరుణంలో స్పానిష్ ప్రజలకు మీరు పంపిన సంఘీభావ సందేశం పంపినందుకు థ్యాంక్స్. సంస్కృతి, పర్యాటకం, కృత్రిమ మేధస్సు కోసం ఉద్దేశించిన డ్యూయల్ ఇయర్‌కు సంబంధించిన లోగో భారత్, స్పెయిన్ ఉమ్మడి దార్శనికతను ప్రతిబింబిస్తుంది. " అని అల్బరేస్ వెల్లడించారు.

ప్రపంచంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్న తరుణంలో భారత్ వంటి విశ్వసనీయ దేశంతో స్పెయిన్ సంబంధాలను పెంపొందించుకోవడం చాలా అవసరమని అల్బరేస్ అభిప్రాయపడ్డారు. "ప్రపంచంలో క్లిష్టమైన పరిస్థితులు ఉన్న ఈ సమయంలో అంతర్జాతీయ చట్టాన్ని విశ్వసించే, ఐక్యరాజ్యసమితి చార్టర్ సూత్రాలను సమర్థించే భారత్ వంటి విశ్వసనీయ దేశంతో సంబంధాలను పెంపొందించుకోవడం స్పెయిన్‌కు చాలా ముఖ్యం. ఈయూ-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరితే ఒక సానుకూల సంకేతం అవుతుంది. స్పెయిన్, భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రెండు ఆర్థిక వ్యవస్థలు. " అని అల్బరేస్ స్పష్టం చేశారు.

## అభివృద్ధి అంటే భవనాల నిర్మాణమే కాదు..

# ప్రజల జీవితాల్లో మార్పు: భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర సంపదను ప్రజలకు సమానంగా పంచటమే ప్రభుత్వ లక్ష్యం.. రాష్ట్రంలోని సంపదను ప్రజలకు సమానంగా పంచడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని, అభివృద్ధి సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని పదేళ్ల పాటు ఎడా పెడా దోచుకొని అప్పుల పాలు చేయటం కాదని గత ప్రభుత్వానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చురకలు అంటించారు. సంపదను సృష్టించి ప్రజలకు సమానంగా పం చటమే సుపరిపాలన అవుతుందని ఎవరికి అందినంత వారు దోచుకోవటం కాదని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అన్నారు. ధర్మపురి పట్టణంలో ప్రభుత్వం మంజురు చేసిన రూ.265 కోట్ల అభివృద్ధిపనులకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, అడ్లూరి లక్ష్మన్ కుమార్‌తో కలిసి బుధవారం కళాశాల మైదానంలో శంకుస్థాపన చేసి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అంతకుముందు ఆయన ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో ఉన్న విలువైన వనరులన్నింటినీ ప్రజలకు అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. సృష్టించి ప్రజలకు పంచడమే అని గుర్తు చేశారు.

**గ్రామీణ ప్రాంతాల్లో రూ. 25 ఎకరాల స్థలంలో..**

ఇందులో భాగంగా పుట్టినవే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అని గర్వంగా చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 25 ఎకరాల స్థలంలో రూ. 200 కోట్ల అంచనా విలువతో నిర్మించబోయే యంగ్ ఇండియా స్కూల్లు ప్రపంచ స్థాయి మేధావులను తయారు చేసేందుకు ఉపకరిస్తాయన్నారు. సంపన్న వర్గాలతో పోటీపడే విధంగా అందులో చదువుకున్న విద్యార్థులు ఉంటారని అభిప్రాయ పడ్డారు. గతంలో ఏర్పాటు చేసిన గురుకులాలను ఎస్సీ, బీసీ మైనార్టీ ఎస్టీ అని విద్యార్థి స్థాయిలోనే విద్యార్థుల మెదల్లలో విష బీజాలు నాటి విడదీశారు. గురుకులాలు కులాల మతాల కుంపటి



ని రాజేసే విధంగా పనిచేశాయని విమర్శించారు. ఇప్పుడు అలా కాకుండా అందరూ ఒక్క చోటే చదువుకునే విధంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఉండి సమాజ అభ్యున్నతికి తోడ్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అంత పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అవసరమా? అని కొంతమంది పెదవి విరిచిన సీఎం రేవంత్ రెడ్డి నేను వెనక్కి తగ్గకుండా ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని శ్రీకారం చుట్టామన్నారు.

**ఆయన ఆలోచనలు చూసి ముచ్చటేసింది..**

దీని కోసం రూ. 22500 కోట్లను వెచ్చిస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే ధర్మపురిలో నేడు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మన్ చిన్న కార్యకర్త నుండి మంత్రి స్థాయికి ఎదిగిన తన బాధ్యతను మరువని వ్యక్తి, ఎన్నికల్లో గెలిచిన వెంటనే తమ వద్దకు వచ్చి తను నమ్ముకున్న ప్రజల కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మా ముందు వీటన్నిటిని ఉంచారు. సీఎంకు నాకు ఆయన ఆలోచనలు చూసి ముచ్చటేసింది. మంచి వ్యక్తికి మంత్రి పదవి ఇచ్చామని మేము సంతృప్తి పడ్డామన్నారు. దీంతో ధర్మపురి నియోజకవర్గానికి రూ.265 కోట్ల అభివృద్ధి పనులను మంజూరు చేశామని బట్టి ప్రకటించారు. ఏ నియోజక వర్గానికి కూడా ఈ స్థాయిలో ఒకేసారి నిధులను విడుదల చేయలేదని స్పష్టం చేశారు. పాద యాత్రలో పేదలు పడుతున్న కష్టాలను చూసి ఆరు గ్యా రంటీలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

**ఇండ్ల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది..**

బిడ్డ గొడ్డు ఏడ ఉంటదని చెప్పి డబుల్ బెడ్ రూం ఇండ్ల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేసింది .కట్టుకున్న వారికి ఐదు లక్షల ఇస్తుంది . కట్టుకున్న రీతిలో వారం వారం బిల్లులు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టిందని గర్వంగా చెప్పుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లతో రాష్ట్రంలో పేదవాడి ఆత్మ గౌరవం నిలబడిందన్నారు.ప్రజలతో తమ కు ఉన్న బంధం బాధ్యత ఇదే అని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్తితి బాగా లేకున్నా ఖర్చుకు వెనుకాడకుండా ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని గుర్తు చేశారు. ఇచ్చిన మాట తప్పకుండా రూ .26700 కోట్లు వడ్డీ లేని రుణాలను మహిళలకు ఇచ్చామ న్నారు. అదే విధంగా రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగ చేయాలని అనుకున్నాము.

**ఎవరెన్ని విమర్శలు చేసిన వెనక్కి తగ్గే పనేలేదు..**

రైతు భరోసా, రుణమాఫీ సబ్సిడీలు, బోనస్ , యాంత్రీకరణ రూపంలో రైతులకోసం రూ .1లక్ష కోట్లు ఖర్చు చేశామని గర్వంగా చెప్పారు. చేనేత సంక్షేమ విద్యుత్ విద్య వైద్య రంగాలకు అధికంగా నిధులు కేటాయిస్తున్నాం. అభివృద్ధి సంక్షేమం రెండు కల్లుగా కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎవరెన్ని విమర్శలు చేసిన వెనక్కి తగ్గే పనేలేదని, పంచాయితీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి ఓట్లు వేసిన విధంగా మునిసిపాలిటీ ఎన్నికల్లో సైతం ఆశీర్వ దించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించు కోవాలని బట్టి చివరగా ఓటర్లను విజ్ఞప్తి చేశారు

## మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**జలమండలి ఎండి అశోక్ రెడ్డి**

**జూబిలీ హిల్స్, బంజారా హిల్స్ లో పర్యటించిన ఎండీ**

*** క్షేత్ర స్థాయిలో పైప్ లైన్ నిర్మాణం పనులు పరిశీలన***

**హైదరాబాద్, జనవరి 21(ప్రభాత ఉదయం)**

జలమండలి ఓ అండ్ ఎం డివిజన్–6 పరిధి.. జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్ పరిధిలో సమస్యాత్మకమైన ప్రాంతాలను ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. మొదట జూబ్లీ హిల్స్ రోడ్ నెం.36 పోలీస్టేషన్ ప్రాంతంలో సరియైన సీవరేజ్ అవుట్ లెట్ సరిగ్గా లేని కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. దీంతో జలమండలి కొత్త 300 మిమీ డయా సీవరేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులు చేపట్టింది. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఈ ప్రాంతంలో సీవరేజ్ పైప్ విస్తరణ పనులు పరిశీలించారు. ఏళ్లనాటి సీవరేజ్ లైన్లు, రోడ్డుకింద పూడుకుపోయినట్టు, దీంతో మట్టి, చెత్త చేరి సీవరేజ్ సాఫీగా చేరకుండా.. ఓవర్ ఫ్లో అవుతున్నట్లు అధికారులు ఎండీకి వివరించారు. అలాగే ఈ ప్రాంతంలో భూగర్భంలో షీట్ రాక్‌ను కట్ చేయాల్సి ఉండటంతో పైప్ నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని అధికారులు చెప్పారు. శాశ్వత పరిష్కారం కోసం పనులు వేగవంతం చేసి , తాత్కాలికంగా సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎండీ సూచించారు.అనంతరం బంజారాహిల్స్ రోడ్ నెం.12 వద్ద 450 మిమీ డయా సీవరేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులు పరిశీలించి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఎండీ సూచించారు. రోడ్డు నెంబర్ 12 సితార గ్రాండ్ నుంచి విరించి ఆసుపత్రి వరకు ఉన్న సీవరేజ్ లైన్ ముప్పై ఏళ్ల నాటిది కావడంతో.. ఫ్లో పెరిగి తరుచూ 2 కిలోమీటర్ల మేరకు మురుగు పారేది. దీంతో ఈ ప్రాంతంలో సీవరేజ్ లైన్లను డీ–సిల్టింగ్ చేసి తాత్కాలికంగా సమస్యలని పరిష్కరించేవారు. శాశ్వత పరిష్కారంగా పైప్ లైన్ పునర్నిర్మాణం చేయాలని ఎండీ అశోక్ రెడ్డీ అధికారులను ఆదేశించారు. పనులను వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బంది.. యంత్రాలతో నెలలోపు ఈ పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పని ప్రాంతాల్లో భద్రతా నిబంధనలను పాటిస్తూ అవసరమైన నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులకు ఎండీ ఆదేశించారు. పైప్‌లైన్ నిర్మాణం పనులు పూర్తికాగానే రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం ప్రభాకర్,ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రెండవ సారి త్రాగునీరు వృధా..

**ఇంటికి నల్లా కనెక్షనను తొలగించిన జలమండలి అధికారులు**

**ఎవరైనా ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎండీ హెచ్చరిక**

**బంజారా హిల్స్, జనవరి 21(ప్రభాత ఉదయం)**

జలమండలి సరఫరా చేసే తాగు నీటిని రెండో సారి వృధా చేసిన ఇంటి నల్లా కనెక్షన్ తొలగించారు. ఈ ఇంటి యజమాని గతంలో నీటిని వృధా చేసినందుకు పదివేల రూపాయలు జరిమానా విధించారు. ఈ ఘటన బంజారా హిల్స్ లో జరిగింది. గత సెప్టెంబర్ 3 న జలమండలి బంజారా హిల్స్ రోడ్ నం. 12 లో ఓ వ్యక్తి తాగునీటి సంపు నిండి ఓవర్ ఫ్లో అయి దాదాపు ఒక కిలో మీటర్ వరకు తాగునీరు రహదారిపై ప్రవహించింది.. దీంతో ఓ అండ్ డివిజన్ స్థానిక మేనేజర్ వెళ్లి పరిశీలించి తాగునీటిని వృధా చెయ్యకూడదని చెప్పారు. అతనికి నోటీసు అందించి, ఎండీ ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి 10 వేల రూపాయలు జరిమానా విధించారు. అంతే కాకుండా మరో సారి ఇలా చేస్తే కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు. బుధవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి బంజారా హిల్స్ ప్రధాన రహదారిపై వెళుతుండగా... రోడ్ నం. 12 లో నీరు లీకేజీ అయినట్టు ఎండీ గమనించి.. గతంలోనూ నిర్లక్ష్యంతో నీటిని వృధా చేసినందుకు ఈ వ్యక్తికే జరిమానా విధించారని సరిచూసుకుని ఎండీ ఆగ్రహం వ్యక్తం చేసి.. రెండో సారి నీటిని వృధా చేసినందుకు కనెక్షన్ తొలగించమని అధికారులను ఆదేశించారు. దీంతో జలమండలి అధికారులు ఆ ఇంటి నల్లా కనెక్షనను తొలగించారు.జలమండలి సరఫరా చేసే తాగునీరు ఇలా ఇతర అవసరాలకు వినియోగించద్దని, అలాగే విలువైన త్రాగునీటిని వృధా చేయకూడదని ఎండీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే.. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే

**కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య**

**రాజేంద్రనగర్, జనవరి 21(ప్రభాత ఉదయం) :**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో బుధవారం గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఈ రోజు నాటిన మొక్కలను ఒక చిన్న బిడ్డల సంరక్షించాలని సూచించారు. మొక్కలను ప్రేమతో పెంచితే అవి భవిష్యత్తులో సమాజానికి ఆక్సిజన్ తో పాటు ఆశను కూడా అందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు నాటిన మొక్కలను నాలుగు సంవత్సరాల పాటు సంరక్షిస్తే పట్టభద్రులు అయ్యే సమయంలో ఆ మొక్కతో పాటు విద్యార్థి ఫోటోను గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ తో పొందేలా చర్యలు



తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇది విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యతను మరింతగా పెంపొందించే వినూత్న ఆలోచనగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి హెచ్ ఎం డీ ఏ డైరెక్టర్ వీఎస్ఎన్వీ ప్రసాద్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ కు చెందిన శ్రీనివాస్, ముఖ్య అతిథులుగా హాజరైనారు . గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే ద్వారా పర్యావరణహిత జీవన విధానాలు, పచ్చదనం పెంపొందించడం, వనరుల సుస్థిర వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్ లో తమ వృత్తి జీవితంలోనూ పర్యావరణ అనుకూల విధానాలను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్ పాల్గొని ఉపకులపతి మరియు ముఖ్య అతిథులతో కలిసి మొక్కలు నాటారు. బీఎస్సీ ఏజీ మొదటి సంవత్సర విద్యార్థులు సుమారు 500 మొక్కలను నాటారు. ఈ భారీ స్థాయిలో జరిగిన మొక్కలు నాటడం ద్వారా క్యాంపస్ ను హరితమయం చేయడమే కాకుండా, పర్యావరణ సంరక్షణపై విద్యార్థుల్లో దీర్ఘకాలిక అవగాహన కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని మొక్కలు నాటడం, విద్యార్థులను సమన్వయపరచడం మరియు కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు.



హైదర్ గూడ లో రూ 16లక్షలతో చేపట్టనున్న సివరేజి పైపు లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ ఎం సంగీత తదితరులు

## హైదర్ గూడ లో రూ 16 లక్షలతో చేపట్టనున్న సివరెజ్ పైపు లైన్ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన

**రాజేంద్రనగర్, జనవరి 21 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. హైదర్ గూడ డివిజన్ లో రూ .16 లక్షల తో చేపట్టే సివరెజ్ పైపు లైన్ పనులకు బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్థానిక కార్పొరేట్ ఎం సంగీత తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.... సివరేజీ నిర్మాణ పనులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు . లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ లలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు . ప్రజా సమస్యల పరిష్కారంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ ఆలీ ఖాన్, నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి, బొక్క ప్రభాకర్ రెడ్డి, పలుగుచెరువు మహేష్ , ప్రవీణ్ రెడి , మహేందర్' మ్యాడం రామేశ్వర్ రావు, ఎం.కొమురయ్య, రమాదేవి ,ఎస్ అఖిలేష్, వీరార్జున్, అనుముల జాన్ పాల్, కొంగళ్ళ బుచ్చయ్య, శ్రీనివాస్ , లు పాల్గొన్నారు.



అత్తాపూర్ లో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

## అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవం

**రాజేంద్రనగర్ , జనవరి 21 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ నందిముసలై గూడా రోడ్డులో బుధవారం డివిజన్ బీజేపీ కార్యాలయం ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరైనారు . ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో అత్తాపూర్ డివిజన్ లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని జోష్యం చెప్పారు. గతంలో నేను ఎంపీ ఎన్నికలలో పోటీ చేసిన సమయంలో రాజేంద్రనగర్ అసెంబ్లీలో అత్తాపూర్ డివిజన్లో హైయెస్ట్ మెజార్టీ వచ్చిందన్నారు . ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, ఎం సంగీత, నాయకులు వైస్ శ్రీధర్, ఎం కొమురయ్య , కాడెం సుధాకర్ , అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ స్టార్ రాజు, వెంకట్ రెడ్డి శశికాంత్ శర్మ, అమర్నాథ్ రెడ్డి, విజయ స్వామి, విమల్ శర్మ, చేతన్ సింగ్, జిత్తు సింగ్, వేణు రెడ్డి శ్రీపాలే రెడ్డి , సందీప్, రాజశేఖర్ రెడ్డి, సరిత రెడ్డి, విజయ రెడ్డి , అనురాధ, కృష్ణవేణి, గుర్పీత్ సింగ్, నరేష్ వినోద్ తదితరులు పాల్గొన్నారు



రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ కు వినతి పత్రం అందచేస్తున్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

## మహా శివరాత్రి కి బందోబస్తు ఏర్పాటు చేయాలి

**రాజేంద్రనగర్, జనవరి 21 ( ప్రభాత ఉదయం) :**

ఫిబ్రవరి 14 నుంచి అత్తాపూర్ రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో జరుగనున్న మహా శివరాత్రి వేడుకల సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రణవ భక్త సమాజం సభ్యులు బుధవారం రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ కు వినతి పత్రం అందచేశారు. ఏసీపీ ని కలసిన వారిలో సంఘం అధ్యక్షుడు ఎం నరసింహ, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, నాయకులు బర్ల మల్లారెడ్డి, ఎస్ విజయ్ కుమార్ లు ఉన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో మొక్కను నాటి నీళ్లు పోస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, చిత్రం లో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేటెడ్ డీన్ డాక్టర్ ఎం గోవర్ధన్



## పెబ్బేరులో ఘనంగా ఎద్దుల బండ లాగు పోటీలు

**ఎద్దుల పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి**

**పెబ్బేరు, జనవరి 21(ప్రభాత ఉదయం)**

పెబ్బేర్ పట్టణ కేంద్రంలో ఎద్దుల బండ లాగుడు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మాజీ రాజ్యసభ సభ్యులు , మాజీ వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల నాయకులు, రామకృష్ణాపురం గ్రామ పార్టీ సీనియర్ నాయకులు మూలమల్ల యుగేందర్ రెడ్డి , నాయకులు కావాలి జగతి పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# ఆకలి తీర్చే "ఆర్డర్లు" ఆశలు మోస్తున్న "వీల్స్"

**శేరిలింగంపల్లి :జనవరి 21,(ప్రభాత ఉదయం)**

ప్రతి సంవత్సరం డిగ్రీలు పీజీ పూర్తి చేసి లక్షలాది మంది నిరుద్యోగులు క్యాంపస్ నుండి బయటకు వస్తుంటే కనీసం వేలల్లో కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. సొంత ఊర్లో వ్యవసాయం పనులు చేయలేక చదువుకున్న డిగ్రీ పట్టుకుని నగరానికి వచ్చి కోచింగ్ సెంటర్లో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల కోసం ఎదురుచూస్తూ పడిగాపులు కాస్తున్నారు. చదువుకున్న చదువుకే సరైన ఉద్యోగం దొరకక నగరంలో అనేక మంది నిరుద్యోగులు డెలివరీ బాయ్స్ గా పని చేస్తు జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో నిరుద్యోగిత అనేది ఒక నిశ్శబ్ద పోరాటం. చదువుకున్న చదువుకి చేసే పనికి పొంతన లేకపోయినా... ఆకలి తీర్చుకోవడం కోసం నగరంలో నిరుద్యోగ యువత చేస్తున్న ఈ ప్రయాణంపై ప్రత్యేక కథనం.




## ఆకలి తీర్చే 'ఆర్డర్లు'...

## ఆశలు మోస్తున్న 'వీల్స్'

హైదరాబాద్ నగరంలోని సిటీ సిగ్నల్ మధ్యాహ్నం ఎండ మండిపోతోంది. సిగ్నల్ పడగానే వందలాది బైకులు ఒక్కసారిగా రేస్ గుర్రాల్లా కదిలాయి. ఆ గుంపులో నిరుద్యోగులు నడుముకు వెనుక 'జొమాటో' బ్యాగు' చేతిలో పాత స్మార్ట్‌ఫోన్ గమ్యం.. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక బిర్యానీ పాయింట్. ఆర్డర్ లేట్ అయితే కస్టమర్ రేటింగ్ తగ్గిపోతుంది, అప్పుడు ఆ రోజు సంపాదన మీద దెబ్బ పడుతుంది. మూడేళ్ల క్రితం ఐటీ రంగంలో ఏదైనా సాఫ్ట్‌వేర్ కంపెనీలో సెటిల్ అవ్వాలని ఎన్నో కలలతో నగరానికి వచ్చిన వారు. మూడు సంవత్సరాలుగా ఐటీ రంగంలో 'రిసెషన్' (ఆర్థిక మాంద్యం) నీడలు కమ్ముకున్నాయి. కొత్త రిక్రూట్‌మెంట్లు లేవు. ఉన్న ఉద్యోగాలే ఊడిపోతుంటే, కొత్తగా డిగ్రీలు పట్టుకుని వచ్చే వారికి దారులు మూసుకుపోయాయి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాల్సిన వాడు, గూగుల్ మ్యాప్స్ సాయంతో గల్లీ గల్లీ తిరుగుతూ ఫుడ్ డెలివరీ చేస్తున్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా నోటిఫికేషన్లు లేకపోవడంతో ఫుడ్ డెలివరీ బాయ్ అవతారం ఎత్తి జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తే జీవితం సెటిల్ అవుతుందని భావించి వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి కోసం నగర బాటపడుతున్నారు. కానీ వాస్తవానికి నగరంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు ఉన్నా కొత్త నోటిఫికేషన్లు రావడం గగనమైపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్నదల్లా గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ల ప్రక్రియను పూర్తి చేయడం మాత్రమే. దీనివల్ల గత కొన్నేళ్లుగా కొత్తగా పాసవుతున్న నిరుద్యోగులకు ఏ దారీ కనిపించడం లేదు.

ఆకలేస్తే తినడానికి సమయం ఉండదు. సరిగ్గా మధ్యాహ్నం 2 గంటలకు అందరూ భోజనం చేసే టైమ్, ఆ సమయమే ఈ నిరుద్యోగులకు పీక్ బిజినెస్ అవర్. ఇతరుల ఆకలి తీర్చడం కోసం తన ఆకలిని చంపుకుని బైక్ నడుపుతుంటాడు. ఆ సమయంలో శ్రీశ్రీ రాసిన కవితో, లేక పాత సినిమా పాటలో గుర్తుకొస్తుంటాయి. "సాపాటు ఎటు లేకపోయినా.. ఆశ చావదు" అనే ధైర్యమే అతన్ని నడిపిస్తోంది.

జియో మార్ట్, స్విగ్గీ, రాపిడో ఇలా ప్లాట్‌ఫారమ్ ఏదైనా పని మాత్రం ఒకటే. రోజుకు 12 నుంచి 14 గంటలు రోడ్ల మీద గడపడం. నెలాఖరుకు వచ్చే పది పదిహేను వేల రూపాయలు రూమ్ రెంట్‌కు, ఇంటికి పంపే కొద్దిపాటి పైసలకే సరిపోతాయి.

నగరంలో డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్న వారిలో 60 శాతంపైగా డిగ్రీలు, పీజీలు చేసిన వారే ఉండటం గమనార్హం. చాలా మంది డెలివరీ పనిని అవమానంగా భావించకుండ బాధ్యతగా తీసుకొని జీవనం సాగిస్తున్నారు. చదువుకున్నాం కదా, ఈ పని ఎలా చేయాలి?" అని మొదట్లో సిగ్గుపడిన ఇంట్లో తల్లిదండ్రుల మందుల ఖర్చులు, చెల్లి చదువుల తోపాటు సమస్యలు గుర్తొచ్చినప్పుడు ఆ సిగ్గు కంటే ఆకలి పెద్దదిగా కనిపిస్తుంది. డెలివరీ ఆర్డర్లు లేని సమయంలో 'రాపిడో' రైడర్‌గా మారిపోతాడు. వెనుక కూర్చున్న ప్యాసింజర్ కూడా ఐటీ ఉద్యోగి అయితే, తన మనసులో ఎక్కడో చిన్న బాధ కలుగుతుంది. "నేను కూడా అక్కడ ఉండాల్సిన వాడిని కదా" అని చిన్న చిన్న బాధతో నిట్టూర్పు. నిరుద్యోగులు ఈ దుస్థితికి కారణం కేవలం ఆర్థిక మాంద్యం మాత్రమే కాదు ప్రభుత్వాల ప్రణాళికా లోపం వ్యవస్థపై అసహనం వేస్తుంది. మేము ఓట్ల కోసం కాదు మా పొట్ట నింపుకోవడానికి ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నామని రాబోవు రోజుల కోసం ఆశతో సర్దుకుపోతున్నారు.

ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి కేవలం పాత ప్రక్రియలను పూర్తి చేయడం కాకుండా, కొత్తగా డిగ్రీలు పూర్తి చేసిన యువతకు ప్రైవేట్ ప్రభుత్వ రంగాల్లో అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని నిరుద్యోగులు అంటున్నారు. ప్రతిరోజు రాత్రి 11 గంటలు చివరి ఆర్డర్ పూర్తి చేసి తన గదికి చేరుకుని అలసిపోయిన ఒళ్లు. కానీ కళ్లలో మాత్రం ఇంకా ఆశ చావలేదు. రేపు పొద్దున్నే లేచి మళ్ళీ కోచింగ్ సెంటర్ నోట్స్ చదవాలి. ఎప్పటికైనా ఒక నోటిఫికేషన్ వస్తుందని, తన తలరాత మారకపోతుందని నమ్మతో ఎదురు చూస్తు కాలం వెళ్లదీసే నిరుద్యోగులు అనేక మంది. ఆ నమ్మకమే నేడు సగం దేశం నిరుద్యోగ యువతను బ్రతికిస్తోంది.

# పాపారాయుడు నగర్ లో నిర్మిస్తున్న అక్రమ షెడ్లపై అధికారుల చర్యలు ఉండవా ?

**ప్రమాదాలు సంభవిస్తేనే అధికారులు చర్యలు తీసుకుంటారా..?**

**అక్రమ షెడ్ల నిర్మాణంపై టౌన్ ప్లానింగ్ అధికారుల సహకారం ఉందంటున్న స్థానికులు**

**అక్రమ షెడ్లు వాణిజ్య, వ్యాపార కేంద్రాలుగా మర్చి సొమ్ము చేసుకుంటున్న పట్టించుకొని అధికారులు**

**ప్రమాదకర అక్రమ షెడ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తక్షణమే చర్యలు తీసుకోవాలి**

**కూకట్ పల్లి, జనవరి 19 (ప్రభాత ఉదయం)**





అనుమతి లేకుండా నిర్మిస్తున్న షెడ్లు

కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లో అనుమతి లేని అక్రమ షెడ్లు భారీగా పెరిగిపోతున్నాయి. జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా షెడ్లను చేపడుతున్న నిర్మాణదారులపై సంబంధిత అధికార విభాగం చర్యలు చేపట్టకపోవడంతో ఎక్కడ చూసిన అక్రమశిల సంఖ్య పెరుగుతుంది. ఎప్పుడైనా ఎక్కడైనా అక్రమ షెడ్లలో ప్రమాదాలు సంభవించిన సమయంలో అన్ని విభాగాల అధికారులు వాలిపోయి అక్రమ షెడ్ల నిర్మాణాలు తప్పంటూ ఉపన్యాసాలు ఇస్తారు. అక్రమ షెడ్ల నిర్మాణాల సంఖ్య పెరగడంలో టౌన్ ప్లానింగ్ అధికారుల సహకారం పూర్తిస్థాయిలో ఉందని స్థానికులు తెలుపుతున్నారు. కూకట్ పల్లి డివిజన్ లోని పాపారాయుడు నగర్, రామారావు నగర్ లో కొనసాగుతున్న అనుమతి లేని అక్రమ షెడ్ల నిర్మాణాలు అందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ప్రజల ఫిర్యాదులను కనీసం పట్టించుకోకుండా విధులు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులకు ప్రభుత్వం ప్రమోషన్ల పేరుతో ఉద్యోగాలను మరింత భద్రత కల్పించడం ఆస్యాస్పదంగా ఉంది. ఒక్క సర్కిల్ లోనే అనుమతి లేని అక్రమ నిర్మాణాలను, అక్రమ షెడ్లను కట్టడి చేయలేని టౌన్ ప్లానింగ్ విభాగం లోని పక్క నియోజకవర్గమైన కుత్బుల్లాపూర్ సర్కిల్ కు సైతం అధికారిగా నియమించడం హాస్యాస్పదంగా ఉందని పలువురు వాపోతున్నారు. కూకట్ పల్లి సర్కిల్ పరిధిలో చేపడుతున్న అక్రమ షెడ్లతో ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉన్న అందిన గాడికి దండుకుంటున్న అధికారుల సహకారంతో రోజురోజుకు షెడ్ల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయి. పాపారాయుడు నగర్ లో అక్రమ షెడ్లలో ఇప్పటికే ఓ చికెన్ మార్ట్, వైన్స్, టీ స్టాల్ కొనసాగుతున్న కొత్తగా మరో అక్రమ షెడ్డు నిర్మాణంలో ఉంది. అక్రమ షెడ్లు వాణిజ్య వ్యాపార కేంద్రాలుగా తయారు కావడంతో ఏ సమయాన ఏ ప్రమాదం పొంచి ఉంటుందోనన్న భయాన్ని కాలనీవాసులు వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారాలు చేపడుతున్నారన్న ఫిర్యాదులను అందుకుంటున్న జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం మానేసి వారి వద్ద అందిన గాడికి దండుకుంటూ అక్రమ షెడ్లకు అనుమతిని ఇస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు మేలుకొని అనుమతి లేని ప్రమాదకర అక్రమ షెడ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కొత్త పాత అని తేడా లేకుండా నిబంధనలు ఉల్లంఘించిన షెడ్లను తక్షణమే తొలగించాలని పలువురు కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే సరైన చర్యలు తీసుకొని ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించాలని వారు పేర్కొంటున్నారు.

# ఉజ్వల భవిత మీది – భరోసా మాది

**ప్రతీ మహిళ, ఆడపిల్ల ఉజ్వల ముగా.....**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 21(ప్రభాత ఉదయం):**

మహిళలు, పిల్లలకు... వారి హక్కులు, భద్రత, ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమం ఉజ్వల భవిత మీది – భరోసా మాది అనే నినాదంతో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని.... మొట్టమొదటి సారిగా... పాలకుర్తి మండలం గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో " ఉజ్వల " అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ముఖ్య అతిదులు గా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహిళలు, పిల్లల హక్కులు, భద్రత, ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం ని...ప్రతి బుధవారం జిల్లాలోని వివిధ పాఠశాలలో... మహిళా, శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పోలీస్ శాఖ, విద్యాశాఖ, వైద్య శాఖ ,గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు ఇతర సంబంధిత శాఖల భాగస్వామ్యంతో (కన్వెర్జెన్స్) ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ...




పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న కలెక్టర్

సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి ఉజ్వల కార్యక్రమం ద్వారా ఐదు శాఖల సమన్వయంతో కృషి చేయన్నుట్లు తెలిపారు. సమస్యలని తెలుసుకొని డిపార్ట్మెంట్స్ వారు కోఆర్డినేషన్ చేసుకుంటూ సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. పోలీస్, ఆరోగ్య, విద్యాశాఖ,ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు.. వీరితో పాటు.. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్స్, పంచాయతీ సెక్రటరీ, ఆశా ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్స్ ఇలా అందరిని భాగస్వామ్యం చేసి.... ఉజ్వల టీం అనే పేరు తో..... శారీరక, మానసిక, గృహ హింస, విద్య పరంగా ఇలా ప్రతీ అంశం లో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని సాల్వ్ చేసేందుకు తీసుకోవాలిసిన చర్యలను చేపడ దతారన్నారు.ఆడపిల్లలకు విద్య అత్యంత ముఖ్యమని.... పదవ తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ స్థాయిలో అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంల సమన్వయంతో హెమోగ్లోబిన్ (ఎచ్బి) పరీక్షలు నిర్వహించి, రక్తహీనత ఉన్న మహిళలు, బాలికలకు అవసరమైన పోషకాహార కిట్లు అందించాలని సూచించారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్మాట్లాడుతూ....సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు ఎదురైతే వెంటనే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.చివర గా... జిల్లా కలెక్టర్, డీసీపీ విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడి, క్రీడలు శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలియజేస్తూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వర్ధన్నపేట డివిజన్ ,స్టేషన్ ఘన్పూర్ ఆర్డీఓ వెంకన్న, వైద్యాధికారులు, జిల్లా సంక్షేమ అధికారి, కె. కోదండరాములు గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డిఎచ్ఈడబ్ల్యూ సిబ్బంది ,పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.



# బస్తీ దవఖానలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం:

**ఎమ్మెల్యే జిఎంఆర్**

**కొత్తకోట జనవరి 21( ప్రభాత ఉదయం)**

బస్తీ దవాఖానాలలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యం కల్పించడానికి కృషి చేస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. బుధవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని 13వ వార్డు లో బస్తీ దవాఖాన ను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు, అనంతరం మానసిక వికలాంగుల సంస్థఆధ్వర్యంలోని ఎన్ హెచ్ సి సెంటర్ ను పరిశీలించి, సిసి రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజాపాలనలో వైద్యానికి, విద్యకు మొదటి ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. గత పాలకులు పట్టణానికి నిర్లక్ష్యం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో వేల కోట్ల రూపాయలతో పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. నిర్మాణం మధ్యలో ఆగి ఉన్న ఇంటిగ్రేడ్ మార్కెట్ యార్డ్ పిల్లర్స్ ను తొలగించి ఆ స్థానంలో కొత్త మున్సిపల్ భవనాన్ని నిర్మించబోతున్నామని ,సెంటర్ లో ట్రీస్ తొలగించి ప్రజలకు సౌకర్యంగా ఉండే చెట్లను నాటుతామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున నిలబడుతున్న అభ్యర్థులను గెలిపించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, డిహెచ్ఎంఓ సాయినాథ్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ శ్రావణి,డాక్టర్ ఆసియా బేగం, మున్సిపల్ కమిషనర్ సైదయ్య,బోయేజ్,కృష్ణారెడ్డి,మేస్త్రి శ్రీనివాసులు, పీజే బాబు, శేఖర్ రెడ్డి, వేముల శ్రీనివాసరెడ్డి,ఎల్లంపల్లినరేందర్ రెడ్డి, ఎండి లతీఫ్, మిషేక్, క్రాంతి కుమార్,సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



# కుమారిలో ఘనంగా మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 21 (ప్రభాత ఉదయం )**

నేరడిగొండ మండలం కుమారి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మార్కండేయ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి, భక్తులు విశేష పూజలు నిర్వహించారు. వేడుకల్లో పద్మశాలి సంఘ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మార్కండేయ మహర్షి జీవితం, ఆయన బోధనలు సమాజానికి అందించిన ఆదర్శాలను ఈ సందర్భంగా వక్తలు వివరించారు. సత్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠతో జీవించాలనే సందేశాన్ని యువత హృదయాలలో నాటాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో శ్రీనివాస్ పి వి రమణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న కలెక్టర్

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు లో భారీగా జరిమానా

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 21(ప్రభాత ఉదయం):**

జనగామ పోలీస్ స్టేషన్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జిల్లా అడ్మిన్ కోర్టు జడ్జి కుమారి సందీప 13 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో దొరికిన ఒక్కొక్కరికి పదివేల చొప్పున మొత్తం ఒక లక్ష 20వేల రూపాయలు విధించారు. ఈ కేసులో చీటూరు కు చెందిన బండారి ఆంజనేయులు కు రెండు (2) రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

# గ్రామాభివృద్ధి లక్ష్యంగా నూతన సర్పంచులు పనిచేయాలి:

**ఎం పి కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 21(ప్రభాత ఉదయం)గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు పరిపాలన సాగించాలి చేవెళ్ళ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర రెడ్డి అన్నారు.బుధవారం జిల్లాలోని శంషాబాద్ మండలం



ముచింతల్ స్వర్ణ భారతి ట్రస్ట్ లో నూతన సర్పంచ్ లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి చేవెళ్ళ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తూ పంచాయతి వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల ఆశయాలను నెరవేర్చే బాధ్యత సర్పంచ్ లదే అని, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక వ్యవస్థ, పాలన విధానాలు, నిబంధనలు, నిర్వహణ అంశాలలో పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండడం అవసరమని, శిక్షణ కార్యక్రమం గ్రామాభివృద్ధికి అత్యంత కీలకమైనదని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, డివిజనల్ పంచాయతీ అధికారులు సతీష్ రెడ్డి, సాధన, సాంబి రెడ్డి, షాబాద్ ఎంపిడిఓ అపర్ణ, శంషాబాద్ ఎంపీడీవో ముని , ఎంపిడిఓ మంచాలు బాలశంకర్, కేశంపేట్ ఎంపీడీవో కిష్టయ్య ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు రహదారి భద్రతపై ప్రజలకు ఆదర్శంగా నిలవాలి





**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 21(ప్రభాత ఉదయం)**

అధికారులు రోడ్డు నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ రహదారి భద్రత విషయంలో ప్రజలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ పిలుపునిచ్చారు.జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన చేరుకోండి, జీవించండి అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, ఎస్పి శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ అధికారులు ప్రతి నిత్యం తమ కార్యాలయాలకు ద్విచక్ర వాహనాలు, కార్లలో వస్తుంటారు కాబట్టి తాము తప్పకుండా రహదారి నియమాలను పాటించాలన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖ రహదారులు నిర్మించేటప్పుడు నాణ్యతతో పాటు, రోడ్డు భద్రత ఉండేలా డిజైన్ చేసే విషయంలో అధికారులు నిబంధనలను పాటించాలని, అలాంటప్పుడే వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా చూడవచ్చు అన్నారు. తాను హైదరాబాదులో ఔటర్ రింగ్ రోడ్డు ఎండీ గా పనిచేసిన సమయంలో అక్కడ జరిగిన ప్రమాదాలకు కారణాలను విశ్లేషించడం జరిగిందని, స్పీడ్ లిమిట్ ఒక రకంగా డిజైన్ చేసి ఉంటే వాహనదారులు అధిక వేగంతో పోవడం, అకస్మాత్తుగా రహదారులపై వాహనాలను నిలపడం వంటివి ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. కర్నూల్ జిల్లాలో గతేడాది జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది మృత్యువాత పడడం, ఇతర సంఘటనలను దృష్టిలో ఉంచుకొని డ్రైవర్లు ఎంతో బాధ్యతాయుతంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయాల్సి ఉందన్నారు. ప్రమాదాల కారణంగా ఆయా వ్యక్తుల నుంచి రావాల్సిన వస్తు ఉత్పత్తి తగ్గిపోతుందని, ఫలితంగా దేశ జిడిపి పై దాని ప్రభావం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతుండడం ప్రస్తుతం సర్వసాధారణమైందని, ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై అవగాహనతో ముందుకెళ్లాలన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి కారణాలతో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇలా జరగకుండా ఉండాలంటే సంబంధిత రవాణా శాఖ, ట్రాఫిక్, పోలీస్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని అప్పుడే ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను పాటిస్తారన్నారు. కొన్ని దేశాల్లో రహదారి భద్రతపై ప్రజలకు మంచి అవగాహన ఉందని, మన వద్ద కూడా ప్రమాదాల నివారణకు ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పౌరుల బాధ్యతాయుతమైన ప్రవర్తనతోనే రహదారి ప్రమాదాలను నివారించవచ్చని, రోడ్డు భద్రత ప్రతి కుటుంబానికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఇంటి యజమాని, పిల్లలు, జీవిత భాగస్వామి అనుకోని ప్రమాదాలతో మృతిచెందితే ఆయా కుటుంబాలు అనుభవించే ఆర్థిక, మానసిక వేదనను పూడ్చడం చాలా కష్టమన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో పనిచేసే ఉద్యోగులు ద్విచక్ర వాహనంపై వచ్చేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధన ఉండాలన్నారు. ద్విచక్ర వాహనంపై మహిళలను, చిన్నారులను ఎక్కించుకుని నడిపేటప్పుడు వారిని గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చే విషయంపై జాగ్రత్తలు పాటించాల్సి ఉందన్నారు. ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు సరైన సమయంలో చికిత్స అందించడం వైద్య శాఖ అధికారుల బాధ్యత అని గుర్తు చేశారు. విద్యాశాఖ అధికారులు కూడా పాఠశాల బస్సులు సరైన కండిషన్లో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని, ఫలితంగా విద్యార్థులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చన్నారు. ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకుండా రవాణా శాఖ, ఇతర అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పౌరులకు డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేటప్పుడు వారికి ఆ వాహనాలను సరిగ్గా నడపడం వస్తుందో, లేదో పరిశీలించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో, తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలను నడపడం వలన ప్రమాదాలను చాలావరకు తగ్గించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రహదారి ప్రమాదాల నివారణపై ముద్రించిన పోస్టర్లను అతిథులు విడుదల చేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి అతిథులు రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పి శంకర్, ఆర్డీవో అలివేలు, పలువురు ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు వ్యాపార అవకాశం కల్పించాలి: కార్పొరేటర్ గీత ప్రవీణ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( చిల్కానగర్ డివిజన్ ) జనవరి 21 ( ప్రభాత ఉదయం ):-**



చిరు వ్యాపారులకు వ్యాపార అవకాశం కల్పించాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. బుధవారం చిల్కానగర్ డివిజన్ ఎం జి ఆర్ ఐ మెట్రో స్టేషన్ నుండి స్టేడియం మెట్రో స్టేషన్ వరకు వీధి వ్యాపారులను ట్రాఫిక్ సిబ్బంది , ఇబ్బంది పెడుతున్నారని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సంప్రదించారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ గీత ప్రవీణ్ ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ట్రాఫిక్ సిఐ నాగరాజు తో మాట్లాడి చిరు వ్యాపారులు ఎదురుకుంటున్న సమస్యలు వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరు వ్యాపారులకు వ్యాపార చేసుకోవడానికి అవకాశం కల్పించాలని ట్రాఫిక్ సిఐ నాగరాజుకు విన్నవించమన్నారు. రోజువారీగా పండ్లు, పూలు, అమ్ముకునీ జీవనం కొనసాగిస్తున్న పేద చిరు వ్యాపారులను ఇబ్బంది కలవకుండా చర్యలు తీసుకోవాలని సిఐని కోరామన్నారు. వెంటనే ట్రాఫిక్ సిఐ నాగరాజు సహృదయంతో స్పందించి వీధి వ్యాపారులను రోడ్ల పైకి రాకుండా, ఫుట్పాత్ పైననే వారి పండ్లతో కూడిన ఎక్సెల్ బండ్లను ఉండే విధంగా చూసుకోవాలని చిరు వ్యాపరులకు సూచించారని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పండ్ల వ్యాపారులకు దిశానిర్దేశం చేశామన్నారు. చిరు వ్యాపారులకు వారి రోజువారి వ్యాపారానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రతిసారి వారికి సహాయపడుతూ అటు పోలీసు, ట్రాఫిక్, జిహెచ్ఎంసి సిబ్బందిని ఒప్పించి వారికి బాసటగా నిలుస్తునా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్ కు ట్రాఫిక్ సీఐ నాగరాజు కు చిరు వ్యాపారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ సీనియర్ నాయకులు ఏదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, బాలు వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# 7 వ భూగర్భ జలాలు జలాశయలు ఎత్తి పోతల పథకాల గణన

**గద్వాల జిల్లా ప్రతినిధి,జనవరి21(ప్రభాత ఉదయం)**





కేంద్ర జలాశయాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర అర్ధ గణాంక శాఖ 7. వ. భూగర్భ జలాలు జలాశయలు ఎత్తి పోతల పథకాల గణన ను జిల్లాలో కూడా చేపట్టడం జరిగింది.2023-24 ను ప్రామిణిక సంవత్సరం గా తీసుకుని అన్ని రకాల సాగు నీటి పారుదల పథకాలను రైతుల వారీగా, ప్రతి సర్వే నెంబర్ ను నమోదు చేస్తూ జియో ట్యాగింగ్ చేయడం జరుగుతుంది, దీని ద్వారా నీటి పంపిణీ విధానం, నీటి పారుదల విస్తీర్ణం, జలాశయాల ద్వారా నీటి పారుదల, మత్స్య సంపద, ఇతరాత్ర వివరాలను అంచనా వేసి రైతులకు అవసరమైన తగు ప్రణాళికలను రూపొందించడం జరుగుతుంది.ఈ సర్వే కు జిల్లా కలెక్టర్ , జిల్లా ఛార్జ్ ఆఫీసర్ గా, మండల తహశీల్దార్ లు మండల ఛార్జ్ ఆఫీసర్లు గా , గ్రామ పరిపాలన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నిక్ అసిస్టెంట్లు క్షేత్ర సిబ్బంది గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సర్వే ను పర్యవేక్షణ కోసం రాష్ట్ర అర్ధ గణాంక శాఖ సహాయ సంచాలకులు మహేందర్ రెడ్డి విశ్వేశ్వరయ్య హాజరయ్యారు. ఈ సర్వే ను ముఖ్య ప్రణాళిక అధికారి, గణాంక అధికారులు,ఉప గణాంక అధికారులు, మండల ప్రణాళిక, గణాంక అధికారులు పర్యవేక్షిస్తున్నారు అని ముఖ్య ప్రణాళిక అధికారి ఆకారపు పాపయ్య , గణాంక అధికారులు నాగార్జున గౌడ్, నసీమా బేగం ఉప - గణాంక అధికారులు హైమావతి, మహ్మద్ జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి సన్నద్ధతతో ఉండాలి

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 21(ప్రభాత ఉదయం):**




మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని స్థాయిల్లో పూర్తి సన్నద్ధతతో ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ... సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. నామినేషన్లు స్వీకరించే కేంద్రాల్లో గోడ గడియారం ఏర్పాటు చేయడంతో పాటు, నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆర్ఓలు, ఏఆర్ఓల నియామకాలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది నియామకంలో 20 శాతం అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని తెలిపారు.నూరు శాతం బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉండాలని, పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను ముందుగానే పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు.ఈ వీసీ లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.. జనగాం మున్సిపాలిటీ లోని 30 వార్డులు, స్టేషన్ ఘనపూర్ కి సంబందించి 18 వార్డులకు ఎన్నికల కోసం అన్ని ప్రక్రియ లు పూర్తి అయ్యాయని. అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ వీసీ లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.



# ఆలయం వద్ద డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

## శాంతి శ్రీనివాసరెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) జనవరి 21 ( ప్రభాత ఉదయం ):**

అల్వాల్ డివిజన్ కొత్త బస్తి జగన్నాథ ఆలయం వద్ద పొంగుతున్న డ్రైనేజీ సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి వెంటనే నివారించాలని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం అల్వాల్ డివిజన్ కొత్త బస్తి జగన్నాథ్ గుడి దగ్గర మూడు రోజులుగా డ్రైనేజీ పొంగి భక్తులకు ఆటంకం కలిగిస్తుందని తెలుసుకున్న కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలిసి పొంగుతున్న డ్రైనేజీని పర్యవేక్షించారు. స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి వెంకటాపురంలోని పలు కాలనీలను పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్వాల్ డివిజన్ కొత్తబస్తీలో పొంగుతున్న డ్రైనేజీని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టి నివారించాలని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి వెంటనే తీసుకురావాలని కాలనీ ప్రజలను కోరారు.

ఈ కార్యక్రమంలో అధికారులు మేనేజర్ కృష్ణమాచారి ,శేఖర్, సిబ్బంది స్థానిక నాయకులు అరవింద్ కుమార్ ,ప్రేమ్ కుమార్, యాదగిరి గౌడ్, సాజిద్ స్థానికులు సెల్వ రాజు ,అరుణ్ కుమార్, రామానుజన్ ,కార్మినన్, రాజు అరుణ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రాజకీయ పార్టీలలో ఉన్న మాదిగలు డైలీ ఆవిష్కరణలో పాల్గొనాలి:

## అయ్యగాళ్ల వీరస్వామి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( నాగారం డివిజన్ ) జనవరి 21 ( ప్రభాత ఉదయం):-**




అన్ని రాజకీయ పార్టీలలో ఉన్న మాదిగలంతా డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అయ్యగాళ్ల వీరస్వామి అన్నారు. బుధవారం మాదిగ డైరీ-2026 ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా స్థాయిలో విస్తృత ప్రచారంలో భాగంగా నాగారంలో అయ్యగాళ్ల విరస్వామి డైరీ ఆవిష్కరణ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న 8వ ఆవిర్భావ సభ, మాదిగ డైరీ 2026 7వ ఆవిష్కరణ, అలాగే మాదిగ సర్పంచ్ ఉప సర్పంచ్ లకు ఘన సన్మానం కార్యక్రమాలను జిల్లా స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి విజయవంతం చేయాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న మాదిగ సోదరి సోదరులందరూ పార్టీ భేదాలు పక్కనపెట్టి ఐక్యంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. మాదిగ సమాజ అభివృద్ధి, ఐక్యతకు ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలవనుందని చెప్పారు. కులసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మాదిగ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రతి మాదిగ కుటుంబానికి సమాచారం అందించాలని అయన విజ్ఞప్తి చేశారు.



# మల్లాపూర్ డివిజన్ లో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తా: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మల్లాపూర్ డివిజన్ ) జనవరి 21 ( ప్రభాత ఉదయం ):**

మల్లాపూర్ డివిజన్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మలాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో రూ.72 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డిలు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తున్నామని అన్నారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని చెప్పారు. ప్రతి కాలనీలో నాణ్యమైన రహదారులు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఎస్ఎఫ్–2026కు విద్యార్థుల హాజరుతో భారీ సందడి





**పటాన్ చెరు జనవరి 21 (ప్రభాత ఉదయం):**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీఈఆర్టీ, విఐటిఎం బెంగళూరు సంయుక్తంగా నిర్వహిస్తున్న దక్షిణ భారత విజ్ఞాన ప్రదర్శన–2026 (సదర్న్ ఇండియా సైన్స్ ఫెయిర్–2026) ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా ఆర్.సి.పురం మండలం కొల్లూర్‌లోని గౌడియం స్కూల్ క్యాంపస్‌లో ఘనంగా కొనసాగుతోంది. ఈ విజ్ఞాన ప్రదర్శన ఈనెల 19 న ప్రారంభమై 23 లో తేదీతో ముగియనుంది. విజ్ఞాన ప్రదర్శన మూడో రోజు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిరంతర సందర్శనలతో ఉత్సాహభరితంగా కొనసాగింది. విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనల్లోని వివిధ ప్రాజెక్టులను పరిశీలిస్తూ, ఇంటరాక్టివ్ సెషన్లలో చురుకుగా పాల్గొంటూ కనిపించారు. దక్షిణ భారతదేశానికి చెందిన ఆరు రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ మార్గదర్శక ఉపాధ్యాయులతో కలిసి ఈ విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొని, తమ వినూత్న ప్రాజెక్టులు, ఆలోచనలను ప్రదర్శించారు. స్మార్ట్ దోమల నివారణ జాలం, ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం (ఆంధ్రప్రదేశ్), సెన్సార్ల సహాయంతో నడుస్తున్న బస్సుల్లో అగ్ని ప్రమాదాలను నివారించే విధానం, పాఠశాల స్థాయిలో వ్యర్థాల నిర్వహణ వంటి అనేక అద్భుతమైన విజ్ఞాన ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలు విద్యార్థుల లోతైన శాస్త్రీయ అవగాహనను, వాటిని వాస్తవ జీవిత సమస్యల పరిష్కారానికి వినియోగించే సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఒక సందర్శక ఉపాధ్యాయుడు తెలిపారు. ప్రదర్శిత ప్రాజెక్టులను నిపుణులైన న్యాయనిర్ణేతలు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం మూల్యాంకనం చేశారు. మూడో రోజు నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్లు విజ్ఞాన ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ రోజున తల్లిదండ్రుల సైతం చురుకైన భాగస్వామ్యం కనిపించడంతో, ఈ కార్యక్రమం అందరికీ అనుభవాత్మకమైన అభ్యాస వేదికగా మారింది. ఎస్ఐఎస్ఎఫ్–2026 మూడో రోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని 7 జిల్లాల నుంచి 187 పాఠశాలలకు చెందిన సుమారు 10,173 మంది విద్యార్థులు ఈ విజ్ఞాన ప్రదర్శనను సందర్శించినట్లు అంచనా. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, వినూత్న ఆలోచనలు మరియు అనుభవాత్మక అభ్యాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు



## మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్, జనరల్ స్థానాల్లో అన్ని పార్టీలు మాదిగలకు ప్రాధాన్యత కల్పించాలి:

**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ**

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 21 ( ప్రభాత ఉదయం)**

మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్, జనరల్ స్థానాల్లో అన్ని పార్టీలు మాదిగలకు ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ కోరారు. బుధవారం అదిలాబాద్ జిల్లా కేంద్రంలో పద్దెనిమిది వార్డు.రణదీవ్య నగర్ లో ఎమ్మార్పీఎస్ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేష్ మాదిగ.. మాట్లాడుతూ.. జిల్లా మున్సిపాలిటీ పరిధిలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు మున్సిపాలిటీ పరిధిలో నలభై వార్డులలో జనాభాలో అగ్రభాగాన ఉన్న మాదిగలకు ఆరు రిజర్వేషన్ స్థానాలతో పాటు జనరల్ స్థానాలలో అన్ని పార్టీలు బి ఫామ్ లు కేటాయించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.జనరల్ స్థానాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేసే స్థాయిలో మాదిగల జనాభా ఉంది, ఈ నేపథ్యంలో మాదిగ జాతిని విస్మరించే పార్టీలు రాజకీయంగా తగు మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు ఒకే సామాజిక వర్గానికి వత్తాసు పలకడం సామాజిక న్యాయానికి తూట్లు పోడవడమేనని, ఇలాంటి రాజకీయ పార్టీలకు మాదిగలను ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని గుర్తు చేశారు .మాదిగ జాతి అస్తిత్వాన్ని ఉనికిని రాజకీయ ఎదుగుదల శక్తికి ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందన్నారు.ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సందూరి వినయ్ సాగర్, ఆరేపల్లి గణేష్, జిల్లా కార్యదర్శి గడి చందా మోహన్, పుల్లూరి రాజన్న, చందల అశోక్, ఉమేష్, పుష్ప, పోచన్న, గంగాధర్, రమేష్, చిన్నయ్య ప్రమోద్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




డీజీఎంగా పదోన్నతి పొందిన మహిళ అధికారికి నియామక పత్రం అందజేస్తున్న జలమండలి ఎండి అశోక్ రెడ్డి

## పదోన్నతులు పొందిన వారంతా.. బోర్డుకు ఎలాంటి మచ్చ రాకుండా పని చేయాలి:

**జలమండలి ఎండి అశోక్ రెడ్డి**

**జలమండలిలో 26 మంది మేనేజర్ల కు డీజీఎంగా పదోన్నతి**

**ఖైరతాబాద్, జనవరి 21(ప్రభాత ఉదయం)**

జలమండలిలోని పలు విభాగాల పరిధిలో మేనేజర్ లుగా పనిచేస్తున్న 26 మందికి డీజీఎంలుగా పదోన్నతి కల్పించారు. బుధవారం ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తో పాటు ఈడీ మయాంక్ మిట్టల్ హాజరై నీ అమ్మకు పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. హాజరయ్యారు.ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... ప్రమోషన్లు పొందిన వారు ప్రజలకు మంచి సేవలందించి, బోర్డు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జలమండలి పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, పీఅండ్ఏ సీజీఎం సురేష్, జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి వైద్యమే పేద ప్రజలకు అండ నిలుస్తుంది: పావని జంగయ్య యాదవ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఘట్కేసర్ సర్కిల్ ) జనవరి 21 ( ప్రభాత ఉదయం ):- ప్రకృతి వైద్యం పేద ప్రజల కొండగా నిలుస్తుందని ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఉల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. బుధవారం జిహెచ్ఎంసి ఘట్కేసర్ సిర్కిల్ డ్వాక్రా భవనం లో వయో మిత్ర పకృతి వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ పాల్గొని ప్రకృతి వైద్యాన్ని తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వైద్యం పేద ప్రజలకు కొండంత అండగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ ఆయుష్ విభాగం ముఖ్య ప్రయోజనం, ఆయుర్వేద, యునాని, హోమియోపతి వంటి భారతీయ సాంప్రదాయ వైద్య విధానాల ద్వారా ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడం అభినందనీయం అన్నారు. ఈ రంగంలో నాణ్యమైన విద్యను ప్రోత్సహించడం, మందుల తయారీ తో పాటు నాణ్యతను పాటించడం, యోగా, ప్రకృతి చికిత్సల ద్వారా ప్రజారోగ్యాన్ని మెరుగుపరచ వచ్చునని వైద్యులు చెప్పారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, డిస్పెన్సరీలను బలోపేతం చేయడం ద్వారా అందరికీ అందుబాటులో ఉండేలా చేయడం మంచుదన్నారు. ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు స్వయం సంరక్షణపై అవగాహన కల్పించి వ్యాధుల భారాన్ని తగ్గించలన్నారు. ప్రకృతి వైద్యం ద్వారా ప్రభుత్వ ఖర్చును తగ్గించిన వారమవుతామని అన్నారు. ప్రకృతి వైద్యం ద్వారా ప్రధాన ప్రయోజనాలు ఆయుర్వేద, యునాని, హోమియోపతి, యోగా, ప్రకృతి చికిత్సల ద్వారా ప్రజలకు చికిత్సలు అందించ వచ్చునని వైద్యులు వెల్లడించారన్నారు. ఆయుష్ వైద్య కళాశాలల్లో గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యను అందించడం ద్వారా అర్హత కలిగిన వైద్యులను తయారు చేయవచ్చునని అన్నారు. మందుల లభ్యత ప్రభుత్వ ఫార్మసీల ద్వారా నాణ్యమైన ఆయుష్ మందులను ఉచితంగా అందించడం సాధ్యమవుతుందన్నారు. ఆయుష్ మందుల తయారీ, విక్రయాలు నాణ్యతను నియంత్రించడం. ఆయుష్ గ్రామ వంటి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ ఆరోగ్య సేవలు అందించడం, యోగా శిక్షకులను నియమించడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన కల్పించ వచ్చునన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణ అంటువ్యాధుల నివారణకు కృషి చేయడంతో ఆయుష్ విధానాలను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. సంక్షిప్తంగా, తెలంగాణ ఆయుష్ విభాగం దేశీయ వైద్య విధానాలను బలోపేతం చేయడం ద్వారా ప్రజలందరికీ సమగ్ర, సురక్షితమైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి కట్టుబడి ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాలు యాదవ్, మాజీ కౌన్సిలర్ కడుపుల్ల మల్లేష్ , సీనియర్ నాయకులు కొంతం అంజి రెడ్డి , డీసీసీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు , యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ్ రెడ్డీ , నాయకులు సిరాజ్, బాలరాజ్, పల్లె విజయ్ గౌడ్, సల్మాన్ రాజ్, వైద్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## బిఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే మోరిలో వేసినట్లే:

**బిజెపి దేవరకద్ర అసెంబ్లీ ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి**

**కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు ఓటు అడిగే హక్కు లేదు**

**కొత్తకోట, జనవరి 21( ప్రభాత ఉదయం)**

బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే మోరిలో వేసినట్లేనని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు గనుక వారు ఓటు అడిగే నైతిక హక్కు కోల్పోయారని దేవరకద్ర బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బిజెపి పట్టణ కార్యకర్తలు నాయకులతో కలిసి పట్టణంలోని పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయం వీధిలో బిజెపి పార్టీ జెండా ఎగరవేసిన అనంతరం కొండ ప్రశాంత్ మాట్లాడుతూ... గత కొత్తకోట మున్సిపాలిటీ ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులను నలుగురుని గెలిపి చారని వారు వార్డు అభివృద్ధిలో ఎక్కడ అవినీతికి తావు లేకుండా వార్డులను అభివృద్ధి చేసిన ఘనత బీజేపీ పార్టీ అభ్యర్థులకే సాధ్యమవుతుందని అన్నారు. వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో బిజెపి పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించి చైర్మన్ పదవి ని బిజెపికి పార్టీకి అవకాశం ఇవ్వాలని చెప్పారు. పట్టణానికి కేంద్ర ప్రభుత్వ నిధుల నుండి అమృత్ స్కీం కింద 12 కోట్ల రూపాయల నిధులను తెస్తే స్థానిక ఎమ్మెల్యే నిధులను వినియోగించకుండా నిర్లక్ష్యానికి గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాని నరేంద్ర మోడీ, ఎంపీ.డికే అరుణ సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేసుకునే దిశగా ప్రజలు బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎంపీ డీకే అరుణ సమక్షంలో 24 తేదీన వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో పెద్ద ఎత్తునచేరబోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎద్దుల రాజ వర్ధన్ రెడ్డి,మహబూబ్ నగర్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము భరత్ భూషణ్, వనపర్తి శ్రీనివాస్ రెడ్డి ,దాబా శీను,పబ్బ నరేందర్ గౌడ్, వెంకట్ రెడ్డి, స్టార్ బాలు, రాజారాం యాదవ్, కొమ్ము సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనను విజయవంతం చేయాలి:

**డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ**

**ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 21 ( ప్రభాత ఉదయం )**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు రానున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పర్యటనను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పిలుపునిచ్చారు. బుధవారం జైనూరు మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జైనూరు మండలం జంగాం గ్రామ సమీపంలో డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం పలకడం జరుగుతుందన్నారు. అనంతరం జంగాం గ్రామంలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తారన్నారు.మధ్యాహ్నం 12:00 గంటలకు బూసిమెట్ట క్యాంపు వద్ద పలు అభివృద్ధి పథకాల మంజూరును డిప్యూటీ సీఎం ప్రకటించి, ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 1:00 గంటలకు కెరమెరి మండలం మోడీ గ్రామాన్ని సందర్శిస్తారని, అనంతరం జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పథకాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలన్నింటిని పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆత్రం సుగుణ కోరారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,సర్పంచులు ఉయిక చందన్ షా, రాథోడ్ రాందాస్, ఉయిక చందు,కుమ్రం దుందేరావ్,శంకర్, పెందోర్ ప్రకాష్,దత్తు, అస్లాం,అబ్దుల్,మహ్మద్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణే "అరైవ్ అలైవ్" ముఖ్య ఉదేశ్యం

**శేరిలింగంపల్లి : జనవరి 21,(ప్రభాత ఉదయం )**



సమావేశంలో ప్రమాణం చేయిస్తున్న మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ ఇతర అధికారులు.

మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్ భద్రత మాసోత్సవాల్లో భాగంగా "అరైవ్–అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ ముఖ్య అతిథిగా విచ్చేసి రోడ్డుపై ప్రయాణించే పౌరులు తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రతీ పౌరుడు ట్రాఫిక్ నియమాలను తుచా తప్పకుండా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ సురక్షితంగా ప్రయాణించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, హెల్మెట్ ధరించకపోవడం వంటి నిర్లక్ష్యపు చర్యలే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని స్పష్టం చేశారు. అలాగే హెల్మెట్ ధరించినా దాని బెల్ట్‌ను సరిగా పెట్టుకోకపోవడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ఇన్ స్పెక్టర్ కృష్ణ మోహన్, మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ నాయక్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608